# 69

# ఝండా ఊంచా రహే హమారా

మహాత్మాగాంధీ మన దేశానికి స్వాతంత్ర్యాన్ని- రక్తపాతాన్ని కల్పించే యుద్ధంతో అవసరం లేకుండా సముపార్జించి పెట్టాడు.

ఆయన సూచించిన అహింస, సత్యాగ్రహం వంటి పద్ధతులలో, మొదట్లో చాలా మందికి నమ్మకం లేకపోయింది. కాని, తరువాత ఆయన పద్ధతులలోని గొప్పతనాన్ని ప్రజలు గ్రహించి, ఆయన నాయకత్వంలో స్వాతంత్ర్య సమరం సాగించసాగారు.

1921 ప్రాంతంలో మహాత్మాజీ సహాయ నిరాకరణోద్యమానికి పిలుపు నిచ్చారు. దీనినే 'నాన్ కోపరేషన్ మూమెంట్' అంటారు. దీని ప్రకారం ప్రజలు ప్రభుత్వ ఆజ్ఞలని ధిక్కరించాలి. పన్నులు వగైరా కట్టకూడదు.

ఈ ఉద్యమాన్ని కూడా ప్రజలు ఉధృతంగా చేయడంతో, ప్రభుత్వానికి గంగవెర్రు లెత్తసాగింది. ఫలితంగా వారిపై లాఠీచార్జీలు చేయటం, జైళ్ళలో పెట్టడం వంటి పనులు చేయసాగింది బ్రిటిష్ ప్రభుత్వం.

ఆంధ్రప్రదేశ్‌కి గుండెకాయ వంటిది మచిలీపట్నం. ఈ పట్నంలో భోగరాజు పట్టాభి సీతారామయ్య, బెజవాడ వెంకట నరసింహం, ముట్నూరి కృష్ణారావు, కోపల్లె హనుమంతరావు వంటి యెందరో మహానుభావులు నివసిస్తూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. ఆ వూరిలో కూడా ఉద్యమం ముమ్మరంగా సాగుతోంది.

ఆరోజు గాంధీజీ పిలుపు ననుసరించి సత్యాగ్రహం జరుగుతోంది.

ఊరిలోని అన్ని ప్రాంతాలనుండీ ఉద్యమకారులు జట్లు జట్లుగా బయలుదేరి, చేతిలో త్రివర్ణ పతాకాన్ని పట్టుకొని "వందేమాతరం, మహాత్మాగాంధీకి జై!" వంటి నినాదాలతో, ఊరి మధ్యనున్న రాబర్ట్‌సన్ స్క్వేర్‌వైపు వెళ్లసాగారు.



ఉద్యమం మరీ తీవ్రమైతే వారిపై లాఠీ ఛార్జీ చేయడానికి, అరెస్ట్ చేయడానికి సిద్ధంగా వున్నారు పోలీసులు.

కొంతసేపటికి రాబర్ట్‌సన్ స్క్వేర్ ప్రాంతం సత్యాగ్రహులతో నిండిపోయింది.

పోలీసులు కూడా వారిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా వున్నారు. మధ్య మధ్య జనాన్ని "వెళ్లిపొండి... వెళ్లిపొండి!" అని హెచ్చరిస్తున్నారు. జనం మాత్రం ఉద్రేకంతో 'వందే మాతరం' నినాదాలు చేస్తున్నారు. అక్కడ ఏ క్షణంలోనైనా భీకర సంగ్రామం జరుగుతుందేమో ననిపిస్తుంది... ఆ వాతావరణం చూస్తుంటే!

సత్యాగ్రహులు త్రివర్ణ పతాకాన్ని స్క్వేర్ మధ్యలో వున్న పెద్ద స్తంభంపై ఎగురవేయాలని సంకల్పించారు. కాని, స్క్వేర్ చుట్టూ పోలీసులు కాపలా వున్నారు.

ఇంతలో... ఒక యువకుడు చేతితో జండాని పట్టుకొని మెరుపులాగా స్తంభం వైపు పరిగెత్తాడు. పోలీసులని చీల్చుకుంటూ వెళ్లి, స్తంభానికివున్న ఇనప నిచ్చెనని చకచకా ఎక్కసాగాడు. జనం ఉత్సాహంతో "వందేమాతరం!" అని నినాదాలు చేయసాగారు.

ఈ దృశ్యం చూసేసరికి పోలీసులకి మతిపోయింది. వెంటనే ఒక పోలీసు ఆ యువకుని వెనకాలే పరిగెత్తుకుని వెళ్లి, నిచ్చెనయెక్కి అతన్ని లాఠీతో ఇష్టం వచ్చినట్లు కొట్టడం మొదలుపెట్టాడు.

దెబ్బలు కొట్టుతున్నకొద్దీ అతని ఆవేశం మరింత ఎక్కువయి "వందేమాతరం!" అని గట్టిగా అరుస్తూ పైకి ఎక్కసాగాడు.

పోలీసు దెబ్బలతో అతని తల పగిలి నెత్తురు ధారగా కారసాగింది. గాంధీ టోపి ఎరుపెక్కి పోయింది. అయినా... అతను లెక్కచేయకుండా, స్తంభం ఎక్కి "ఝుండా ఊంచా రహే హమారా!" అంటూ జండాని కట్టాడు.

గాలికి ఆ పతాకం రెపరెప లాడుతోంటే జనం ఉత్సాహంగా జయజయ ధ్వానాలు చేశారు. పోలీసు అవమానంతో ఆ వ్యక్తిని దారుణంగా కొట్టసాగాడు. ఆ దెబ్బలకి అతను స్పృహ తప్పి క్రింద పడిపోయాడు. ఆ తర్వాత పోలీసులు లాఠీ ఛార్జి చేసి జనాన్ని బెదరగొట్టారు. పతాకాన్ని పీకేశారు.

ప్రాణాల్ని సైతం లెక్కచేయక పతాకాన్ని ఎగురవేసిన ఆ స్వాతంత్ర్య యోధుని పేరు... 'శ్రీ తోట నర్సయ్య.' అతని ధైర్యానికి మెచ్చి ప్రజలు అతనికి 'సర్దార్' అని బిరుదు ఇచ్చారు. జనం అతన్ని 'జండావీరుడు' అని చెప్పుకునేవారు.

శ్రీ నర్సయ్య వంటి ఎందరో మహనీయుల త్యాగఫలమే మనకి లభించిన స్వాతంత్ర్యం,

★★★